# ఉత్తరాలు

విజయతో చెడ్డ చికాగ్గా ఉంది రామ్మూర్తికి.

లోకంలో తను ఒక్కర్తె మాత్రమే రామ్మూర్తికి ఉత్తరాలు రాయాలంటుంది. పాఠకుల వెల్లువలాంటి అభిమానాన్ని సంకుచితంగా చూసి ఆనకట్ట కట్టెయ్యమంటుంది. ఇటు విజయకు చెప్పలేడు, అటు పాఠకులకు జవాబు ఇవ్వలేడు. అలాంటి సంకటస్థితిలో పడిపోయేడు రామ్మూర్తి.

అసలు సంగతేమిటంటే రామ్మూర్తి ఒక రచయిత. కథలతో, సీరియల్స్‌తో పత్రికా పాఠకులని ఉర్రూతలూగిస్తున్న ప్రవర్ధమాన రచయిత. అప్పటి పత్రికా పాఠకుల్లో అదిక సంఖ్యాకులయిన కాలేజి అమ్మాయిలు, అబ్బాయిల అభిమానాన్ని పొందేడు.

మరలాంటప్పుడు రామ్మూర్తికి అభిమానుల దగ్గిర నుండి వచ్చే ఉత్తరాలు వారానికి పదికి తగ్గకుండా ఉండేవంటే నమ్మాలి మీరు. అయితే అవన్నీ ఒక ఎత్తు. విజయ అనే అమ్మాయి రాసిన ఉత్తరం ఒక ఎత్తు. ఉత్తరం సారాంశం ఏమీ లేదు. కాని కొసమెరుపులా 'ఇట్లు మీ విజయ' అన్నది కళ్ళు బైర్లు కమ్మించింది రామ్మూర్తిని.

దాంతో విజయా రామ్మూర్తుల ఉత్తరాయణం సాగింది. సాగి సాగి పోస్టుబేగు నుండి పోస్టు బాక్సుకు సాగి, పోస్టుబాక్సు నుండి వాళ్ళ వాళ్ళ ఇళ్ళ పక్కనే పోస్టాఫీసులు పెట్టాల్సినంత వరకూ సాగింది. కథల గుర్చి మొదట ఉత్తరాలు సాగేవి. తర్వాత నవలలు, సీరియల్సు గురించి సాగేవి. ఆ తర్వాత ఉత్తరాలే సీరియల్సుగా సాగేయి. ఇంక ఏవీ లేక ఒక పక్కనుండి అరీనులాంటి ప్రేమగుర్తులూ, మరోపక్క నుండి పెదవుల బొమ్మల్లాంటి ముద్దు గుర్తులూ సాగి చివరకు పాఠకులకూ, పత్రికాధిపతులకూ, చెప్పకేవీ పోస్టలు డిపార్టుమెంటుకూ కృతజ్ఞతలతో పెళ్ళి జరిగింది.

అక్కడితో ఆగిపోయినా బాగుణ్ణు, కాని అక్కడే మొదలయ్యింది

రామ్మూర్తి బాధ. రెండు మూడేళ్ళు ఆయన కథలూ, నవలలూ ఫెయిర్ చేసి పెట్టేది. సంపాదకులకు ఉత్తరాలు రాసిపెట్టేది. సూచనలిచ్చేది. అంత వరకూ బాగానే ఉంది.

పాఠకులు, పాఠకురాండ్రనుండి వచ్చే ఉత్తరాల దగ్గరకు వచ్చేసరికి వచ్చింది పేచీ.

"ఎంతమంది ఉత్తరాలు రాస్తే అందరికీ జవాబివ్వాలా?" అంటుంది విజయ.

"మరి వాళ్ల అభిమానానికి కృతజ్ఞత అయినా చూపుకోవద్దా?" అంటాడు రామ్మూర్తి.

"ఆ కృతజ్ఞతకి పోస్టేజి ఎంత అవుతుందో ఏమైనా ఆలోచించేరా? మీ నవలల పారితోషికమంతా దీనికే పోస్తే రేప్పొద్దున్న పిల్లలు పుడతారు... వాళ్ళకి చదువులూ... పెళ్ళిళ్ళూ... పురుళ్ళూ..." అంటూ మొదలెడుతుంది విజయ.

"అబ్బబ్బా.... విజయా... ఆపు... నన్నభిమానించే పాఠకులను నేనెలా వదులుకునేది? ఎలా దూరం చేసుకునేది?"

"వదులుకోవాలి"

"వదులుకోలేను"

"కాకపోతే... వచ్చిన ఉత్తరాలన్నీ పొయ్యిలో పెట్టి కాఫీ కాస్తాను. ఆ కాఫీ మీచేతనే తాగిస్తాను. తాగకపోతే నామీదొట్టే..."

ఒట్ల సెంటిమెంటుకు ఎంతటి రచయితైనా తలవంచాల్సిందే కదా!

ఇకపోతే...

"నువ్వు నా భార్యవయ్యేవంటే ఉత్తరాల ద్వారానే కదా... ఆ ఉత్తరాలను ఎందుకంత ద్వేషిస్తున్నావ్..." అని అడిగితే...

"నిజమే... ఆ ఉత్తరాలే మనల్ని కలిపేయి. మళ్ళీ ఉత్తరాల ద్వారా మరో పాఠకురాలు ఆరీనుగుర్తులు పంపి మీ ప్రేమను పంచుకోజూస్తే నేను భరించలేనండి..." అని భోరున ఏడుస్తుంది విజయ.

డైలాగులు రాసే రచయిత తన మీదనే ఓ లోతైన డైలాగు విసరబడితే చిత్తుకాకపోతాడా!

ఈ పేచీలు పడలేక ఇద్దరూ రాజీకి వచ్చేరు. రామ్మూర్తి పాఠకుల నుండి వచ్చే ఉత్తరాలు వదులుకోలేడు. విజయ రామ్మూర్తిని వదులుకోలేదు. అంచేత పాఠకుల ఉత్తరాలన్నీ విజయే చదువుతూ దాని సారాంశం అంతా తనే ఒక ఉత్తర రూపంలో రాసి రామ్మూర్తి టేబిలు మీద పెడుతుంది. దానికి అతను జవాబు రాసినా రాయొచ్చు. ఇష్టం లేకపోతే రాయకనూ పోవచ్చు. రాసిన ఉత్తరానికి కాపీలు తీసి జవాబులు పంపుతుంది విజయ.

మొదటి రోజే టేబిల్ మీద ఉత్తరం ఉంది.

"మీ కథలన్నీ సేకరించి ఒకటికి పదిసార్లు చదివేను. అన్నిసార్లు చదవడంలో ఓ విషయం గోచరించింది. అన్నీ ఒకే మూసలో పోసినట్టున్నాయి. ఓ అమ్మాయీ, ఓ అబ్బాయీ, లేక రెండూ ఒకటి, లేదా ఒకటీ రెండూ... ప్రేమా, రెండు మూడింట్లో తప్పించి ఆ పైన త్యాగాలూ, మోడువారిన జీవితాలతో హృదయ విదారకమైన ముగింపుతో - చెప్పొద్దూ అద్భుతంగా ఉన్నాయి! మీరూ రచయిత్రులకేమీ తీసిపోరని వీటి మూలంగా గ్రహించేను.

ఇటువంటి కథలవల్ల మీరేం సాధించదలచుకున్నారు? ఎందుకు ఇటువంటివి పుంఖానుపుంఖాలుగా రాసేస్తున్నారు? ఎవరికోసం రాస్తున్నారు? మీరు రాసేది పత్రికల వాళ్ళిచ్చే పారితోషికం కోసం. పాఠకులలో పాపులారిటీ కోసం. అవార్డుల కోసం. అమ్మాయిల కోసం. వాళ్ళు రాసే ఉత్తరాల కోసం. కాదనండి దమ్ముంటే.

ఒక్క విషయం. ప్రేమలూ, త్యాగాలూ, సెంటిమెంట్లూ బ్రతుక్కి అన్నం పెట్టవని కొన్నాళ్ళు పోయేసరికి నాలాగా అమ్మాయిలందరూ తెలుసుకుంటారు.

మీరు తెలుసుకోకపోయినా, జనం మీద మత్తుమందు చల్లి అజ్ఞానంలో ఉంచి పేరూ, డబ్బూ గడిస్తూ, స్టేజీల మీద నిజాయితీ ఉపన్యాసాలు వల్లించే మీలాంటి రచయితలని తప్పక అసహ్యించుకుంటారు...................."

మరి చదవలేకపోయాడు రామ్మూర్తి. తర్వాత మరెప్పుడూ ఏ ఉత్తరాలు కూడా చదవలేదు. జవాబులూ రాయలేదు.

*(జ్యోతి మాసపత్రిక, ఫిబ్రవరి 1981)*